క్లుప్తంగా

అమ్మవారికి సారె నివేదన



అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులు సారె నివేదించారు. పండ్లు, పిండివంటలు, స్వీట్లు తదితర సారె సామగ్రిని అమ్మవారి ముంగిట చేర్చారు.

దరఖాస్తు చేస్తే తక్షణం ధ్రువపత్రాల జారీ



ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీకి అర్జీ అందజేస్తున్న యువతి

మహారాణిపేట: ప్రజలకు ఎలాంటి సమస్య లున్నా తమ దృష్టికి తేవాలని మహారాణిపేట తహసీల్దార్ (ఇన్‌చార్జి) జిలానీ తెలిపారు. శుక్రవారం 28వ వార్డు భానోజీనగర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా దరఖాస్తు చేస్తే తక్షణం ఇవ్వగలమన్నారు. సదస్సుకు మొత్తం 15 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో డిసెంబర్ 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం సాయంత్రం బల్లిగిరి వేంకటేశ్వరస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన విష్ణు సహస్రనామ సంకీర్తన అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. అనంతరం శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి కోలాట బృందం చేపట్టిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భజన బృందానికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి తీర్థ ప్రసాదాలు అందదేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య భక్తి మంజరి నిర్వాహకుడు శరగడ సూకరాజు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగదాంబ: ఆర్థిక సంస్కరణలతో బడుగు బలహీన వర్గాల జీవన స్థితిగతులు మెరుగుపడడానికి దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వజ్రపతి శ్రీనివాసరావు, గంగాధర్ అన్నారు. వన్‌టౌన్ ఏరియాలో పార్టీ శ్రేణులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దవర వెంకటరమణ, సోదాదాసీ సుధాకర్, కస్తూరి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి

సీతంపేట: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, భావితరాలు మాతృభాషకు దూరం కాకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. విశ్వ సాహితి లలిత కళా వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం శ్రీగణపతిరాజు ఈశ్వర వర్మ స్మారక సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మాతృభాష గొప్పతనం, ప్రాముఖ్యతను పిల్లలకు వివరించాలన్నారు.

బిల్లుల మోత.. ప్రజలకు వాత



ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్‌వెస్లీ, కొండా రాజీవ్ తదితరులు

- విద్యుత్ చార్జీల పెంపుపై కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ప్రజల పక్షాన పోరుబాట
- దక్షిణలో భారీ ర్యాలీ.. నిరసన ప్రదర్శన

పెంచిన చార్జీలు తగ్గించాలి..



గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ బిల్లు వచ్చింది. మాకు రెండు ట్యూబ్ లైట్లు, మరో రెండు లైట్లు, రెండు ఫ్యాన్లు, ఒక ఫ్రిడ్జ్ ఉంది. మహా అయితే మా బిల్లు ప్రతి నెలా రూ.500 నుంచి రూ.600లోపే వచ్చేది. ఇప్పుడు రూ. వెయ్యికి పైగా వచ్చింది. పెరిగిన చార్జీలు తగ్గించకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు.

– పాల శ్రీహరిరెడ్డి

నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచుతారా..



మీ మాటలు నమ్మి ఓట్లు వేస్తే ప్రజల్ని నట్టేట ముంచుతారా. గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు కూడా పూర్తి కాక ముందే విద్యుత్ చార్జీలు పెంచుతున్నారు. ఓ వైపు నిత్యావసర సరకులు మండుతున్నాయి. మీకు రోజులు దగ్గర పడ్డాయి. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వచ్చాయి.

– శ్రీనివాసరావు

ప్రజలపై భారం తగదు..



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గాలికి వదిలి, ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటు. చంద్రబాబు అబద్ధపు హామీలతో మళ్లీ చీకటి రోజులు వచ్చినట్టయ్యింది. సామాన్యుల బతుకులు ఛిద్రమవుతున్నాయి. ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలి.

– పీతల వాసు

ఇదెక్కడి ప్రభుత్వం?



గతంలో మా ఇంటికి రూ. 750 నుంచి రూ. 800 వరకు కరెంట్ బిల్లు వచ్చేది. ఇప్పుడు అవేవో చార్జీలంటూ డబుల్ చేసి బిల్లు పంపించారు. చలికాలంలో తగ్గాల్సింది పోయి ఎక్కువైపోయింది. ఇదెక్కడి ప్రభుత్వం? ఇంత పెద్ద ఎత్తున బిల్లులు వస్తుంటే.. స్పందించాల్సిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించకపోవడంలో ఆంతర్యమేంటో?

– ముత్తాబత్తుల శ్రీనివాస్



ఈపీడీసీఎల్ ఎస్‌ఈ శ్యాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్‌వెస్లీ, కొండా రాజీవ్ తదితరులు



జీవీఎంసీ 35వ నుంచి ర్యాలీగా వెళ్తున్న నాయకులు




అచ్చియ్యమ్మపేట జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు



నిరసన తెలియజేస్తున్న 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమ తదితరులు

దాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ/కంచరపాలెం: సంపద సృష్టిస్తామంటూ అందలమెక్కారు. వినియోగదారులే కరెంట్ అమ్ముతారని ప్రగల్భాలు పలికారు. చంద్రబాబు తాన అంటే.. పవన్ కల్యాణ్ తందాన అంటూ ఊదరగొట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరిచిపోయారు అంటూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రజలపై పెద్ద ఎత్తున భారం మోపుతుంటే పవన్ కల్యాణ్ చూస్తూ ఊరుకోవడంలో ఆంతర్యమేంటో తెలపాలన్నారు. సర్‌చార్జీల ద్వారా సంపద సృష్టిస్తారా? ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఇప్పుడేమో విద్యుత్ మోతతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. వేల కోట్ల భారం ప్రజలపై వేస్తున్న కూటమి సర్కారుపై వాసుపల్లి నిరసన స్వరం వినిపించారు. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చిన పోరుబాటలో భాగంగా వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం జగదాంబ జంక్షన్ వద్ద వినూత్న రీతిన నిరసన చేపట్టారు. గ్యాస్ లైట్లు.. నెత్తిన విద్యుత్ బల్బులు పెట్టుకుని నిరసన చేపట్టారు. అనంతరం జడ్జి కోర్టు సమీపాన గల విద్యుత్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం పార్టీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ తదితర నాయకులు, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో కలిసి వాసుపల్లి ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ జి. శ్యామ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.



కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్‌కుమార్ జైన్, చెన్నా జానకీరామ్, కోడిగుడ్ల పూర్ణిమ, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, పార్టీ నాయకులు మూగి శ్రీనివాసరావు, కోడిగుడ్ల శ్రీధర్, నీలాపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, బాపూ ఆనంద్, దశమంతుల చిన్ని, ముత్తాబత్తుల రమేష్, అలపన కనకరెడ్డి, మాసిపోగు రాజు, నొల్లు పోతుస్వామి, మైకేల్ రాజు, భీశెట్టి ప్రసాద్, ముజీబ్‌ఖాన్, సకలా భక్తుల ప్రసాద్, సనపల రవీంద్రభరత్, రెయ్యి డేవిడ్ రాజు, అమ్మాజీ, కనకల ఈశ్వర్, బడుకుంటి నాగమణి, అనురాధ, పాల శ్రీహరిరెడ్డి, లండా రమణ, లింగం శ్రీను, వడ్డాది దిలీప్, ఆనంద్, మల్లిబాబు, దశమంతుల రామలక్ష్మి, అభిరెడ్డి, ఆదివిష్ణు, బోర శ్రీనివాసులరెడ్డి, పచ్చిరపల్లి రాము, వాసరాల సుబ్రహ్మణ్యం, కోన శంకర్, వాసుపల్లి బంగారమ్మ, సుబ్రమణ్యం, మల్లిబాబు, రవికుమార్, సూర్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, రాము, రమణమ్మ, సంతోష్ కుమార్, తాతారావు, దుర్గాప్రసాద్, మాలిబాబు, ప్రేమ్‌కుమార్, కనకరాజు, పాత్రపల్లి సునిల్‌కుమార్, వేళంగిణిరావు, చుక్కా శ్యామ్ సుందర్‌రెడ్డి, బ్రదర్ లక్కోజి కుమార్, దాలిబాని మధు, ఎస్. మురళి, ఆర్.శ్రీనివాస్, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 26వ రోజు శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం 5 నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. క్షీరాభిషేక సేవలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథయాత్ర..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు మహారాణిపేటలో గల అమ్మవారి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభించనున్నారు. జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్, టౌన్ కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు రథయాత్ర సాగనుంది.



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

కుటుంబం చెంతకు బిహార్ యువకుడు

సీతమ్మధార: రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేక సంచరిస్తున్న బిపిన్‌కుమార్‌ను ఏయూటీడీ సిబ్బంది వెంబడించి పట్టుకుని ద్వారకానగర్‌లో గల టీఎస్‌ఆర్ కాంప్లెక్సులోని జీవీఎంసీ–ఏయూటీడీ పురుషుల షెల్టర్ హోంకు తరలించారు. నాలుగు నెలల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచి వైద్యం అందించారు. దీంతో అతను కోలుకుని తన వివరాలు చెప్పాడు. తనది బీహార్‌కు చెందిన సుపాల్ జిల్లాలోని కుల్లిపట్టి గ్రామం అని వివరించాడు. తల్లితో పాటు ఇద్దరన్నదమ్ములు ఉన్నారని చెప్పాడు. అతను ఏడేళ్ల నుండి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లి వద్దన్నా వినకుండా పని కోసం ఇల్లు వదిలి వెళ్లాడు. సంవత్సరం నుండి కొడుకు కనబడకపోవడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. అతన్ని వైజాగ్ నుంచి తీసుకెళ్లి తల్లి మీనాదేవి, సోదరుడు హరి పాశ్వాన్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.



కుటుంబ సభ్యులతో బిపిన్‌కుమార్

నైపుణ్యాల పెంపుతో లక్ష్య సాధన

విశాఖ విద్య: యువతరం తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, తద్వారా లక్ష్యాలను సాధించవచ్చని ప్రవాస భారతీయుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి ఆచార్య రఘు కొరప్రాటి అన్నారు. శుక్రవారం ఆయన ఏయూను సందర్శించి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున ఆచార్య రఘును రిజిస్ట్రార్ సత్కరించారు. ఆచార్య రఘు కొరప్రాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ చేసి ప్రస్తుతం దక్షిణ కరోలినా రాష్ట్రానికి అటర్నీగా సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య పి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



ఆచార్య రఘును సత్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

కేజీహెచ్ నిర్వహణాధికారిని కలిసిన నర్సులు



కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ రమణను కలిసిన నర్సులు

మహారాణిపేట: కేజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేటర్)గా బాధ్యతలు స్వీకరించిన బీవీ రమణను ప్రభుత్వ నర్సుల సంఘం ప్రతినిధులు, ఇతర నర్సులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, గ్రేడ్–2 కల్పన మౌళి, ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్షురాలు గంగా భవానీ, ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, ఇతర నర్సుల సంఘం నాయకురాళ్లు ఇందిర, గౌరీ, లిల్లీ గ్రేస్, పద్మజ, వినీల తదితరులు పాల్గొన్నారు.

కాంటాక్ట్ లెన్స్‌ల వాడకంపై అవగాహన

ఆరిలోవ: కంటి సమస్యలు ఉన్నవారికి కాంటాక్ట్ లెన్స్ వాడకంపై హనుమంతవాక వద్ద ఉన్న ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్వీపీ కంటి ఆస్పత్రి ఆప్టోమెట్రిస్ట్ గౌతమి మాట్లాడుతూ కాంటాక్ట్ లెన్స్‌లు వాడే వారికి వాటిపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కాంటాక్ట్ లెన్స్ అనేవి వక్రీభవనం, చికిత్స కోసం, సౌందర్యం కోసం ఏర్పాటు చేసుకునే పరికరాలని తెలిపారు. కంటి చూపును సరిచేయడానికి కళ్లద్దాలకు బదులుగా వీటిని వినియోగిస్తారని తెలిపారు. కళ్లజోడుతో పోలిస్తే ఇవి చక్కటి దృష్టిని అందిస్తాయని, వీటిని అమర్చడం వల్ల కళ్లద్దాలకు ప్రతిబింబాలతో ఇబ్బంది కూడా ఉండదని తెలిపారు. నిర్దిష్టమైన చూపు కోసమే ఈ కాంటాక్ట్ లెన్స్‌ను రూపొందించినట్లు తెలియజేశారు. వీటిలో స్క్లెరెల్, కాస్మెటిక్ తదితర కాంటాక్ట్ లెన్స్‌లు ఉన్నాయన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ.. తప్పిన ప్రమాదం

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులోని అంబేడ్కర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ శుక్రవారం కూలిపోయింది. కొన్నాళ్లుగా శిథిలావస్థకు చేరిన ఈ ప్రహరీ ఒక్కసారిగా కుప్పకూలింది. సాయంత్రం 4 గంటలకు పాఠశాల విడిచిపెట్టిన కొన్ని గంటలు తర్వాత గోడ కూలడంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో పాటు నగరానికి వెళ్లే వారు నిత్యం బస్‌లు, ఆటోల కోసం ఈ పాఠశాల గోడ పక్కనే నిరీక్షిస్తుంటారు. ఇదే కూలే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. ఈ ప్రహరీ నిర్మించిన సమయంలో దీనికి సుమారు 300 కిలోలకు పైగా ఇనుప గేటు అమర్చారు. బరువైన ఆ గేటు ముందుకు వాలిపోవడంతో గోడ సపోర్టు కోల్పోయి ఒక్కసారిగాగేటుతోపాటు కుప్పకూలిందని భావిస్తున్నారు.



అంబేడ్కర్‌నగర్‌లో గేటుతో సహా కుప్పకూలిన ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ

గోవిందనామాలు.. జీవనముక్తికి సోపానాలు



ప్రవచిస్తున్న విభీషణ శర్మ



వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: గోవిందనామాలు జీవనముక్తికి సోపానాలని ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కులో శ్రీ వేంకటేశ్వర వైభవం పేరిట నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం రెండో శుక్రవారం విశేషంగా సాగింది. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర వైభవంపై చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. దేవదేవుడు శ్రీనివాసుడు కొలువైన ఏడుకొండలను సరిగమపదనిసలుగా భావించి మహోన్నత వాగ్గేయకారులైన అన్నమాచార్య, త్యాగరాజు శ్రీవారిని కీర్తించి తరించారన్నారు. వారి బాటలోనే విశ్వవ్యాప్తంగా ఉన్న భక్తులు వివిధ కార్యక్రమాల ద్వారా శ్రీవారిని కీర్తించడం, సేవించడం ద్వారా ప్రశాంత జీవనం పొందగలరని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన వివిధ రకాల వేషధారణలు భక్తులను అలరించాయి. కార్యక్రమ నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువతే సమాజానికి దిక్సూచి

మహారాణిపేట: నేటి యువత సమాజానికి దిక్సూచి కావాలని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం 29వ వార్డు హైస్కూల్ ఆవరణలో వీరబాల దివస్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశం కోసం బలిదానాలు చేసిన ఎందరో అమరవీరులను నేటి సమాజానికి, యువతకు పరిచయం చేయటమే లక్ష్యంగా ప్రధాని మోదీ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అబ్దుల్ కలాం, నేతాజీ, ఆజాద్ చంద్రశేఖర్, భగత్‌సింగ్, సుఖదేవ్ వంటి వీరులను స్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో పయనించాలని కోరారు. వీరబాల దివస్‌పై పలు పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరబాల్ దివస్ ఉత్తరాంధ్ర సమన్వయకర్త ఎస్వీఎస్ ప్రకాష్ రెడ్డి, విశాఖ కన్వీనర్ రూపాకుల రవికుమార్, సభ్యులు చొక్కాకుల రాంబాబు, దేవర చంద్రశేఖర్, తలాడ గిరిజ, దశమంతల సుశీల, ఒ. ఆల్బర్ట్, శ్రీను, ఎంవీడీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వి. రమణి, ఉపాధ్యాయులు బీజేవీ రమణ, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



బహుమతి ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రమణి, డాక్టర్ సునీల్‌కుమార్